# మినీ కథ



"బస్సు ఇప్పట్లో వచ్చేట్టులేదు. టైముకు వెళ్ళకపోతే అపతల పని చెడిపోతుంది. ఈబస్సు లెప్పుడూ ఇంతే! అవసరమైన రోజే ఆలస్యం" అని విసుక్కుంటూ వాచీ చూసుకున్నాడు, గుంటూరు బస్టాండులో గంటనుంచి వెయిట్ చేస్తూ వున్న సూర్యప్రకాష్.

ఒంటి గంటయింది.

నాలుగు గంటలకు నెల్లూరులో బిజినెస్ అపాయింట్ మెంట్.

బుక్ స్టాల్లో పుస్తకమేదైనా కొనుక్కుందామని తెనాలి ప్లాట్ ఫారం మీదుగా వస్తున్నాడు సిగరెట్ పీలుస్తూ సూర్యప్రకాష్.

పక్కనుంచి "ప్రకాష్" అన్న మధురమైన పిలుపుతో నిలిచిపోయాయి ప్రకాష్ కాళ్లు.

పదేళ్ళ నాడెప్పుడో తీయగా- ఆప్యాయంగా- అవసరంగా- అహర్నిశలూ విశాఖపట్నం వీధుల్లో, బీచ్ లో, హోటళ్ళలో, రూముల్లో వేలకువేల సార్లు విన్న పిలుపు. మనసులో ఇప్పటికీ మరుగున పడిపోక- కలల్లో, కల్పనల్లో, ఏకాంతంలో ఎన్నోసార్లు పలకరించే కమ్మని పిలుపు.

తల పక్కకి తిప్పిచూశాడు.

నీల—

ఈ జన్మలో మళ్ళీ తనకు ఊహల్లో తప్ప కనబడుతుందనుకోని నీల.

పోస్టు గ్రాడ్యుయేషన్ పూర్తయ్యాక "మా ఫాదర్ కు కలకత్తా ట్రాన్స్ఫరయింది అక్కడికెళ్ళాక ఉత్తరం రాస్తాను, తరువాత శుభలేఖలు- ఆ తరువాత మూడు ముళ్ళు- ఏడడుగులూ" అని చివరిసారిగా చెప్పి తనకు దూరంగా వెళ్ళిన నీల—

తిరిగి ఇన్నాళ్ళకు, పదేళ్ళకు, అదీ నాకు పెళ్ళయ్యాక. ఇద్దరిబిడ్డల తండ్రినయ్యాక- ఈ గుంటూరు బస్టాండులో- ఎంత చిత్రం? అనుకుని.

"హలో నీలా! నీవా!" అంటూ బాయే మూడ్ చేసి నాలుగడుగులు ముందుకు వేశాడు.

తెల్లని ఆ మెడలో నల్లని పూసలపేరు- దాన్నానుకొని బంగారు చైను- దానికి మధ్యగా గుండెలపై, పల్చని గులాబీరంగు చీరలోంచి కనబడే రూపాయి కాసంత రాళ్ళ మంగళ సూత్రం.

"ఫరవాలేదు. నీలకుగూడా పెళ్ళయిపోయింది" అనుకున్న మీదట "నీలా! నువ్విక్కడ?! నాకేదో కలలావుంది" అనేంతలో నీల హాండ్ బాగ్ భుజాన తగిలించుకొని ప్రకాష్ చేయి తన చేతిలోకి తీసుకొని మృదువుగా నొక్కి "కాంటీన్ లో కెళ్దాం పద" అంటూ దారితీసింది.

కాంటీన్ ముందుగా అప్పుడే వచ్చిన తిరుపతి బస్సు "నెల్లూరు రావా! ప్రకాష్!" అని అడిగినట్లుయింది.

"నెల్లూరు పోవాలి–మరి నీలేంకావాలి?" ప్రకాష్ మదిలో చిక్కు సమస్య.

నెల్లూరు బిజినెస్ సెటిలయితే వస్తుందనుకొనే లాభం పదివేలు ఒకవైపు— నాలుగు సంవత్సరాలపాటు అన్ని అనుభూతులూ. ఆనందాలూ కరువెరుగకుండా అందించిన కల్పలత నీల మరోవైపు.

ఆశ నీలవైపే మొగ్గింది—కాంత తర్వాతనే కదా కనకం!?

అప్రయత్నంగానే కాంటీన్లోకి నడిచాయి నాలుగు కాళ్ళు.

"ప్రకాష్! ఇన్నాళ్ళుగా యెక్కడున్నావ్? నేనులేని జీవితం ఎలా గడిపావ్?" అన్నది నీల ఒక మూలని కుర్చీలో కూర్చుంటూ.

"నేనూ అదే అడగాలనుకుంటున్నాను నీలా!"

"ఏమైతేనేం? పరిస్థితులు మనల్ని పదేళ్లు విడదీసి పాలించాయి." అంటూ టేబుల్ క్రిందుగా ప్రకాష్ కాలు తొక్కింది నీల. ఆశగా నీల కళ్ళల్లోకి చూస్తూ "నీలా! నీకింకా ఆనాటి చిలిపితనం పోలేదు. అవును నీలా! ఇంతకూ మీవారేం చేస్తుంటారో చెప్పలేదు" అన్నాడు ప్రకాష్.

"నువ్విప్పుడే గదా అడుగుతూంట" అని భర్త గురించి. పుట్టిన ముగ్గురు పిల్లల గురించి చెప్పింది నీల.

అరగంట గడిచిపోయింది.

రెండు కూల్ డ్రింక్సూ, రెండు కాఫీలు ఖాళీ అయ్యాయి.

చెరో రెండువేల మాటలు ఒకరిమీదొకరు దొర్లించుకున్నారు. పదిసార్లు నీల ప్రకాష్ చేయి పట్టుకుని గిల్లింది. రెండుసార్లు అదే చేతిని ఎవరూ చూడకుండా ముద్దుపెట్టుకుంది. ఏడుసార్లు కాలు తొక్కింది.

అంతేగాకుండా సరిగ్గా వారానికి ఇద్దరూ విజయవాడలో ఒక రాత్రి ఐదుగురు బిడ్డల్ని- ఒక భార్యనూ. ఒక భర్తనూ మరచిపోయి గడపడానికి ముహూర్తం నిశ్చయమయ్యింది.

నెల్లూరు ప్రయాణం ఫెయిలై, నీలను తెనాలి బస్సెకించి తిరిగి ఇంటికొస్తూ నెల్లూరులో బిజినెస్ అగ్రిమెంట్ మీద సంతకం పెట్టవలసిన తాను వారంరోజులకు విజయవాడలో ఏ.సి. రూములో నీలతో, వేలుపోసినా తాను కొనలేని ఆనందం, అనుభూతి పొందడానికి, ఒక్కరాత్రిగడిపే కాంట్రాక్టుకు అగ్రీ అయి వస్తున్నందుకు తనలో తనే వింతగా నవ్వుకున్నాడు సూర్యప్రకాష్.

వారానికి—

విడిపోయి గడిపిన పదేళ్ళకాలం మరుగున పడిపోవాలన్నంత ఆత్రంగా, ఆబగా సుఖాన్ననుభవించారా రాత్రి.

గతంలో గడిపిన నాలుగు సంవత్సరాల మాధుర్యాన్ని మననం చేసుకుంటూ ఏోశెదన్ని కబుర్లు చెప్పుకున్నారు.

ఉదయాన్నే టిఫిన్ చేస్తూ "అవునోయ్ నీలీ! రాత్రి ఇక్కడ గడిపావు గదా! మీ వారికేం చెప్పొచ్చావు? ఊర్లోగాని లేరా?" అని అడిగాడు ప్రకాష్.

"లేకేం? ఊర్లోనే ఉన్నారు. రాత్రి మా అమ్మ చావుబతుకుల్లో వున్నట్లు కలవచ్చిందనీ, పోయి ఆమెను చూడందే మనసు నిలవదనీ చెప్పాను. నమ్మాడు- నమ్మి పొమ్మన్నాడు."

"మరి పిల్లల మాటేమిటి?"

"ఆయన దగ్గరే ఉంటారు."

# నీలి నీడ

"అవున్లే మన కర్థంగదా!" చిలిపిగా చూశాడు ప్రకాష్.

"కాదులేవోయ్! వాళ్ళు ఇంటి దగ్గర వుంటే చచ్చినట్లు ఎటూ కదలకుండా ఇంటి పట్టుకునే వుంటారాయన."

"ఆహా! నీలా! నీతెలివి అమోఘం" అంటూ వీపుమీద చేయివేసి దగ్గరకు లాక్కున్నాడు ప్రకాష్.

"ఇష్టమైన వారి దగ్గరకు చేరడానికి ఎన్ని అబద్ధాలో! ఎన్ని కల్పనలో! ఎన్ని నాటకాలో! ఇంకా ముందుముందు ఇంకెన్ని నాటకాలాడాలో ఈ అబ్బాయిగారి కోసం"అంటూ ముక్కు పట్టుకు ఊపింది నీల ముద్దుగా.

నిర్ణీత సమయం అయిపోయాక చెరో బస్సులో ఎవరి గమ్యాలకు వాళ్ళు చేరుకొన్నారు.

• • •


సరిగ్గా పదిరోజులకు ఉదయాన్నే కాఫీ యిస్తూ "ఏమండీ! రాత్రి మా అమ్మ కేదో అయినట్లు భయంకరమైన కలొచ్చిందండీ! ఏమైనా సరే నేను ఈరోజు మా అమ్మగారింటికి వెళ్ళొస్తానండీ! ఈ ఒక్కరోజుకి మీరు పిల్లల్ని చూసుకోండి. పగలంతా ఎలాగూ ఆయా చూస్తుంది. ఇక రాత్రి కంటారా-మధు పెందలాడే నిద్రపోతాడు. చిన్నాని మాత్రం నగంరాత్రిమీద ఒకసారి లేపండి. లేకపోతే పక్క పాడుచేస్తాడు. రేపు ఉదయం పది గంటలకు తిరిగి ఇక్కడుంటాను గదా! ఎంత! ఒకే ఒక్కరాత్రి. మా అమ్మ దగ్గరుండొస్తానండీ!"అంటున్న భార్య రాజ్యలక్ష్మి మాటలకు హతాశుడై పోయాడు ప్రకాష్. పది రోజుల క్రితం నీల చెప్పిన మాటలు గుర్తొచ్చాయి! అనుమానంతో గుండె మండిపోయింది. కోపం కట్టలుతెంచుకుంది.

కాఫీ కప్పు విసురుగా టీపాయ్‌మీద పడేసి "ఛస్- నీవు చచ్చి గీపెట్టినా ఒక్కత్తివీ పుట్టింటికి పోవడానికి వీలులేదు."అని ఓ శాసనం చేసిపారేసి చకచకా లేచి వెళ్ళాడు.

ఎప్పుడూ అంత గట్టిగా శాసించని భర్త అలా ఎందుకు ప్రవర్తించాడో తెలియని రాజ్యలక్ష్మికి కన్నీళ్ళు కట్టలు తెంచుకున్నాయి.

-అయినాల
కనకరత్నాచారి
సబ్ జైలు సూపరింటెండెంట్
శ్రీకాళహస్తి-517644
(చిత్తూరు జిల్లా)

# వడ్డెపల్లి పదాలు




సంఘద్రోహుల నరెస్టు
చేసే గూండా చట్టం,
అధికారపు వర్గానికి
పనికొచ్చే చుట్టం!

*

ఎంతగొప్ప వాడికైన
ఏపార్టీ పక్షికైన
తప్పదులే ఎప్పటికీ
ఓట్ల కొరకు "బెగ్గింగ్",
ఓడే సూచనలుంటే
ఒకేపనిగ "రిగ్గింగ్"!
అవినీతుల కాలంలో
అధర్మమేగా "కింగ్"!

-వడ్డెపల్లి కృష్ణ

# ఎడిటర్

"హల్లో ఎడిటర్‌గారేనా"

"అవును. చెప్పండి"

"మీ పత్రికలో అచ్చుతప్పు లెక్కువగా ఉన్నాయి"

• •

"హల్లో"

"నేను ఎడిటర్నే చెప్పండి"

"మీ కొత్త పత్రిక, వచ్చిన రెండు వారాలు నాకు నచ్చలేదు"

"ఏం?"

"అన్ని శీర్షికలూ, ఇతర పత్రికలనుండి కాపీలే"

"మారుస్తాను"

• •

"హల్లో ఎడిటర్‌జీ"

"యస్"

"మీ రెండవ సంచిక మరీ బేవార్స్‌గా ఉంది"

"..."

"కథలు, సీరియల్స్ ఏం బాగాలేవు"

"విచారిస్తాను"

• •

మూడవ సంచిక విడుదలయ్యింది.

అందులోని మొదటి పేజి ఎడిటోరియల్‌లో-

"చాలామంది మా నూతన పత్రికను పొగుడుతూ ఫోన్‌కాల్స్ చేస్తున్నారంటే, మా పత్రిక ఎంతటి సంచలనాన్ని సృష్టిస్తున్నదో మాకు అర్థమవుతోంది"అని.

అలా ఎడిటోరియల్ రాసిన ఆయన గార్కి, రెండురోజుల తరువాత, చిత్తూరి నుండి టెలిగ్రామ్ వచ్చింది ఇలా-

"మీకు మళ్ళీ ఆడపిల్ల పుట్టింది"

-కందమూరి జనార్దన్
14-4-78/బి, కయిన్‌కట్‌వీధి,
చిత్తూరు-517001.